

# ఏమని అన్నిన సాతెబూడిది?!

దగ్గరగా గాజులశబ్దం విని తలెత్తి- "హే!....ఏమిటిది?" అన్నాను బిత్తరపోయి విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ. ఆశ్చర్యంతో, ఉత్తరం రాయబోతూన్న నా చేతిలోని పెన్నుజారి కిందపడింది. నా ప్రశ్నకు బదులు చెప్పకుండా, నా తలని రెండు చేతుల మధ్యా ఇరికించుకుని దగ్గరకు లాక్కుని నా కింది పెదవిని కసిక్కున కొరికింది సీత!

నా కళ్ళు పచ్చపడ్డాయి! ఆఫ్రికా కందచీమ కొరికినట్లై, సీతపళ్ళుదిగి నా కింది పెదవికొద్దిగా చిట్లి సన్నగా రక్తపు రుచి తగిలింది నానాలుకకి.

సీత నాతలవదిలిపెట్టి దూరంగా వెనక్కి జరిగి నావంక చూస్తూ నవ్వుతోంది కోపంగా!

కుర్చీలో వెనక్కి జార్లపడి ఊపిరి పీల్చుకున్నాను. తలంటుపోసుకుంది కాబోలు వత్తైన నల్లని శిరోజాలు వదులుగా భుజంమీద పడి అల్లరి పిల్లల్లా చెంపలమీదకు ఎగురుతున్నాయి. కట్టింది పాత నూలు చీరేఐనా చెలికత్తెల్ని ఆటపట్టించడానికి దాసీవేషం వేసిన రాజకుమార్తెలా ఉంది. సీతకోపం నటించడానికి ప్రయత్నిస్తూన్నా, దాచుకుంటున్న నవ్వుల దొంతరలు ఆ ప్రయత్నాన్ని విఫలం చేస్తూన్నాయి. విచ్చీవిచ్చని గులాబీ రేకుల్లాటి లేత పెదవులమధ్య నన్ను కొరికిన సీత ముత్యాల్లాటి పళ్ళు టేబుల్‌లైటు వెలుగులో ఇంద్రుడి వజ్రాయుధపుటంచుల్లా మెరుస్తున్నాయి.

సీత ఏంచేసిందో అర్థంచేసుకుని తేరుకోడానికి నాకు పదినిమిషాలు పట్టింది.

సీత నన్ను ముద్దుపెట్టుకుని నా పెదవి కొరికింది! ఏనాడూ నన్ను తాకనైనా తాకని సీత - ఎపుడో ఒకసారి తనచేతిని నాచేతిలోకి తీసుకోబోతే, నవ్వుతూ, మృదువుగా విడిపించుకుని - 'అవన్నీ ఒకటయ్యాకే' అన్నసీత - ఈ రోజు హఠాత్తుగా తనకితానై నా పెదవికొరికి నారక్తం రుచిచూసింది! కారణం ఊహించ గలుగుతున్నాను.

"ఏయ్ బద్ధూ! ఏమిటలా మతిపోయినవాడిలా, వెర్రిచూపు చూస్తావ్ కళ్ళార్పకుండా?' ' అంటూ నాముఖం ఎదుట చిటిక వేసింది.

"నువ్వు చెప్పకపోతే శుభవార్త నాకు తెలియదనుకున్నావా? ఈసారి నీకీఉద్యోగం వస్తుందని నాకు తెలుసు. నీకీఉద్యోగం రావాలని ఎంతమంది దేవుళ్ళకి మొక్కుకున్నానో తెలుసా? నా మొక్కులు ఊరకే పోలేదు.....' ' సీత చెపుతున్నది నా బుర్రకెక్కడం లేదు.

నాకు ఉద్యోగం వచ్చిన సంగతి తెలిసింది! ఇంక నేను తనవాడిని ఐపోయినట్టేఅని ఆనందం పట్టలేక ఐదేళ్ళుగా నిగ్రహించుకుంటూ వస్తూన్న నిగ్రహాన్ని ఒక్కసారిభళ్ళున బద్దలు కొట్టి తనకి తానై ఒక్క తీవ్రమైన ముద్దుతో నన్ను అమరుణ్ణి చేసింది.

నమ్మిక! నేను తనవాడిననే నమ్మిక సీతకి ఎంతబలాన్నిచ్చింది! ఎంతధైర్యాన్నీ, తెగింపు నీఇచ్చింది! సీతదృష్టిలో సీతా, నేనూ ఒకటవడానికి అడ్డుగా పెనుభూతంలా నిలచిన నా నిరుద్యోగపీడ తొలగిందని తెలవగానే సీతకళ్ళలో ఎంతమెరుపు! ఎంత మోహావేశపు ఎరుపు!

ఎక్కడో సముద్రమధ్యాన లంకలో రాక్షసుల కాపలామధ్య అశోకవనంలో శోకిస్తూ, నారాముడొచ్చి రక్షిస్తాడనే ఆశతో ప్రాణాలు నిలుపుకున్న సాధ్వి సీతలాటి నా సీత - తనని విడిచి బయటకు వెళ్ళిన తల్లికోసం ఎదురుచూసే పసిబిడ్డలా సంవత్సరాల తరబడి నా కోసం నిరీక్షిస్తూన్న నా సీత - పేదరికంలో మగ్గే మహారాణిలాటి నా సీత - తన ఆత్మసౌందర్యపు వెలుగులతో నా బ్రతుకులోని నిరాశా చీకట్లని పారద్రోలుతూన్న నా సీత- నాకు ఉద్యోగం దొరికిందని తెలియగానే ఆ మాత్రం పొంగిపోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు.

కానీ - విధి తనకోసం ఏందాచి పెట్టిందో తెలిస్తే సీత గుండె బద్దలవదా?

సీత నా కుర్చీ వెనక చేరింది-

"ఇంత చక్కని శుభవార్తని నీకు నువ్వే చెపుతావని ఆశపడ్డాను. నేను పుట్టిన తర్వాత ఇంత ఆనందాన్ని ఎప్పుడూ ఎరగను తెలుసా? నీ అంతట నువ్వే వచ్చి చెప్పలేదని ఎంతకోపం వచ్చిందో తెలుసా? అందుకే నీకు అంత గట్టి శిక్ష ఇచ్చాను.... ఏమిటి, మూగనోము పట్టావు ఆడదానిలా?" అంది నా తలని వెనక్కి వంచి నా జుత్తులో వేళ్ళు జొనిపి దువ్వుతూ.


నాతల సీతరొమ్ముల్కి తగులుతోంది వెచ్చగా, మెత్తగా. ఆ వెచ్చదనం అమ్మ ఒడిలోని వెచ్చదనంలా - తప్పటడుగులు వేస్తూ పడిపోయిన నన్ను లేపి రొమ్ములకి హత్తుకున్న అమ్మగుండెల వెచ్చదనంలా సుఖానుభూతి విశ్వధూళిలా నన్నావరిస్తోంది.

-"రామం! నిరీక్షణలో, విరహంలో ఎంత మాధుర్యం ఉంది. ఈ విరహ మాధుర్యం తెలీకుండా శరీరాలు కలుపుకునే వాళ్ళెంత అవివేకులు! ఎప్పుడో, కీట్స్‌పద్యం వివరిస్తూ చెప్పావే నాకు - వినిపించే సంగీతం కన్నా, వినిపించని సంగీతం ఇంకా మాధుర్య మైంద



ఓ.ఆర్. ఇంద్ర






ని. అలా ఇదే నా తొలి స్పర్శఐనా - వింతగా ఇదేమీ నాకు కొత్తగా అనిపించడం లేదు. నిత్యమూ, ప్రతీక్షణమూ నిన్ను నా కళ్ళతోనే స్పర్శిస్తూన్నానే - ఆ స్పర్శించని స్పర్శామాధుర్యం ఎంతగొప్పగా ఉంది! హృదయస్పర్శఇచ్చే మాధుర్యం కన్నా, దేహస్పర్శ ఇచ్చే మాధుర్యం ఏమంత గొప్పది అనిపించక పోవడం విచిత్రంగా ఉంది! ఏన్నో ఏళ్ళనుంచి నిన్నుస్పర్శిస్తూన్నట్టే ఉంది...." సీత ఇంకా ఏదో చెపుతూనే ఉంది-

నా ఆలోచనలు ఉత్తుంగకెరటాల్లా విరుచుకుపడిముక్కలవుతూనే ఉన్నాయి.

నిజమే. నేనూ సీతని తాకకపోయినా - సీత స్పర్శకొత్తగా అనిపించడం లేదు. యుగాల తరబడి సంసారం చేస్తూన్న దంపతుల్లాగే ఉన్నాయి మా మనసులు.

సీత అందచందాల్ని అణువణువూ కళ్ళతో నిత్యమూ త్రాగుతూ మత్తెక్కుతూనే ఉన్నాను - నా ఊహల్లో ముద్దులతోముంచెత్తుతూనే ఉన్నాను. స్వప్న జగత్తులో నా బిగి కౌగిట్లో బంధిస్తూనే ఉన్నాను.

సీతానేనూ మానసికంగా ఏనాడో భార్యాభర్తలమయ్యాం. జరగవలసిందల్లా - ప్రపంచంకోసం తూతూవాయిద్యాలమధ్య జరిగే లౌకికమైన తంతుమాత్రమే. ఏనాడో ముడిపడ్డ మా మానసికానుబంధానికి బహిరంగంగా సీతమెడలో మూడుముడులు వెయ్యడమే.

ఆ సీత రాముడ్ని నమ్మినట్టే - ఈ సీత నన్ను నమ్మింది - గుడ్డిగా, వెర్రిగా, పిచ్చిగా.

చివరకు ఏమిచ్చాడారాముడు ఆసీతకి ప్రతిఫలంగా? తనకోసం నిరీక్షించి, నిరీక్షించి, పునస్సమాగమమనేఆశ ఊపిరిగా ప్రాణాలు నిలుపుకున్న ఆవెర్రిబాగులదానికి రాముడు ఏమిచ్చాడు?

నిరాదరణ! అవమానం! కాననవాసం!

స్త్రీ నిరీక్షణకు ప్రతిఫలం- నిరాదరణ! నిర్లిప్తత!

నాకు ఆ మహానుభావుడి పేరే పెట్టినందుకు నేను ఈ సీతకి ఏం చెయ్యబోతున్నాను? సంవత్సరాల తరబడి నాకోసం నిరీక్షిస్తూన్న సీతకి ఏంఇయ్యబోతున్నాను?

**నిరీక్షణలో, విరహంలో ఎంత మాధుర్యం ఉంది. ఈ విరహ మాధుర్యం తెలీకుండా శరీరాలు కలుపుకునే వాళ్ళెంత అవివేకులు.**

నాలో రగులుతున్న విద్రోహ విస్ఫోటనపు సెగలు ఎరుగక, కసాయివాడ్ని నమ్మి అనుసరించే మేకలా - నేనే తనలోకంలా ఎంతమురిసిపోతోంది పిచ్చిపిల్ల!

ఆసీత ఉసురు తగిలిన రాముడు సుఖంగా బతికాడో - కుములుతూ జీవచ్ఛవంలా బతికాడో నాకు తెలియదు. కానీ, ఈ సీతకి నేను చేయబోయే నమ్మకద్రోహానికి మాత్రం నాకు ఆమరణ పర్యంతమూ నరకమే కాచుకునుందని రూఢిగా నాకు తెలుసు.

నామనసులో చెలరేగుతున్న సుడిగుండాన్ని ఎరుగక - అమాయకురాలు లేత తమలపాకుల్లాటి తన అరచేతుల్తో నా చెంపలు నిమురుతూ ఏదో చెపుతోంది. -

"..... నా ఒక్క కోరికా తీర్చినందుకు నా ఆరాధ్యదైవానికి నా కృతజ్ఞతలు తెలియచేసేందుకు రేపు ఉదయమే రామాలయానికి వెడుతున్నాను..... వింటున్నావా బడ్డూ? నాతో కలిసి గుడికి మాత్రం రావుకదా - నాస్తికుడివి! మనిద్దరినీ జోడీ ఎలా కుదిర్చాడో కదా ఆ భగవంతుడు .... అత్తయ్య ఎక్కడకు వెళ్ళారు? నేను వచ్చానని చెప్పు. రేపు పూజా ప్రసాదం తెస్తాను....'" అంటూ మృదువుగా

నాచెయ్యినొక్కి, నాతల వెనక్కి వంచి నానుదుటిమీద ముద్దాడి వెళ్ళిపోయింది.

సీత మా అమ్మని అత్తయ్యగారని పిలవడం ఇప్పటిది కాదు. పదిహేనేళ్ళక్రితం సీత ఎనిమిదేళ్ళపిల్లగా గౌనుల్లో ఉన్నపుడు వాళ్ళ కుటుంబం మా ఊరికి, మా వీధిలోకి మకాం వచ్చినపుడే ప్రారంభమైంది. చక్రాల్లాటి చారడేసి కళ్ళతో చలాకీగా లేడిపిల్లలా గెంతుతూ పనిపాటల్లో అద్భుతమైన ప్రావీణ్యాన్ని చూపించే సీత అందర్నీ ఆకట్టుకున్నట్టే మా ఇంట్లోనూ అందరినీ ఆకట్టుకుంది. ఇంటిపనిలో సాయపడే సీతంటే అమ్మకి ప్రాణమే. సీతకి పనిపాటలమీద, ముగ్గులమీదా, గొబ్బెమ్మలమీదా ఉన్న ఇంట్రెష్టు చదువుమీద లేకపోవడం వల్లనో, లేక ఆడపిల్లల చదువుమీద తల్లిదండ్రులకి సహజంగా ఉండే చిన్నచూపువల్లో కానీ సీత టెంత్‌క్లాసు గట్టెక్కడమే గగనమయింది. కానీ బుద్ధిగా, శ్రద్ధగా చదువుకునే నన్ను చూస్తే సీతకి భయం, భక్తీ రెండూ ఉన్నాయి. నా టేబుల్ మీద నీట్‌గా, ఎత్తుగా ఉన్న పుస్తకాల దొంతరవంక ఆశ్చర్యంగా చూస్తూ - "అబ్బ! ఎలా చదువుతావ్ అంతలావుగా ఉన్న అన్ని పుస్తకాలు? నాకైతే ఒక్కపేజీకూడా బుర్రకెక్కదు" అనేది. కానీ బొమ్మలతో ఉన్ననా ఇంగ్లీషు డిక్షనరీ, ఎన్‌సైక్లోపీడియాల్లో ఉన్న బొమ్మలవంక ఆశ్చర్యంగా చూస్తూ వాటి గురించి నన్ను అడిగితెలుసుకునేది. నేను పెన్సిల్‌స్కెచెస్ వేస్తానని తెలుసుకుని 'నా బొమ్మగియ్' అంటూ నాప్రాణాలు కొరుక్కు తినేది. తీరా - 'వేస్తాలే, బల్లమీద అలా కదలకుండా కూర్చోమరి' అన్నకాసేపటికే - "బొమ్మ వెయ్యకుండా అలా కళ్ళార్పకుండా నా వంకే చూస్తావేం?" అంటూ దెబ్బలాడి లేచి వెళ్ళి

పోయేది. ఒక్కసారైతే, ఫొటోగ్రఫీ మాగజైన్స్ లోంచి చూసి నేను వేసిన న్యూడ్ స్కెచెస్ (నగ్న రేఖా చిత్రాలు) చూసి - "ఛీ ....ఛీ....! సిగ్గులేదూ ఇటువంటి బొమ్మలు వెయ్య డానికి? అంటూ - " వంటిమీద బట్టల్లేకపోతే ఆడవాళ్ళు ఇలా ఉంటారని నీకెలా తెలుసు?' ' అంటూ నిలేసింది.

-"నా కళ్ళకి బట్టలు అడ్డురావు....." అని అన్నానోలేదో - "బాబోయ్! నీతో చాలా ప్రమాదమే!" అంటూ ఎదుగుతూన్న గుండె లపై చేతులు అడ్డుపెట్టుకుని పారిపోయింది.

మానాన్న ఎలిమెంటరీస్కూల్ హెడ్మా ష్టరైతే - సీత తండ్రి పెట్రోల్‌బంక్‌లో గుమస్తా. ఇద్దరివీ బడుగు జీవితాలే. నలుగురేసి పిల్లలతో - తిన్నారోలేదో ఇతరులకి తెలీకుండా గుట్టుగా, గుంభనగా సంసారాన్ని నెట్టుకు వస్తూన్నవాళ్ళే.

మాఇంట్లో సీత ప్రవేశాన్ని నేను మొదట సీరియస్‌గా తీసుకోలేదుగానీ, క్రమేపీ సీత నాగుండెల్లో గూడు కట్టుకుంటోందని నేను డిగ్రీ చదువుతూంటే నాకర్థమైంది. అందమైన ఆడపిల్ల ఎదురుగా మసులుతూండటంవల్లో, నాటీనేజ్ వయసు ప్రభావమో లేక నన్నా కర్షించిన అమాయకమైన,నిర్మలమైన సీత ముఖవర్చస్సు ప్రభావమో చెప్పలేను. చదు వంటే ఎంతో ఇష్టపడే నేను చదువులేనివాళ్ళంటే చిన్న చూపుచూసేనేను చదువులేని సీతని ఇష్టపడ్డాను. చదువు, నాగరికత మనిషిలో తీసుకొచ్చే స్వార్థం, కాపట్యం, జిత్తులమారితనం, లౌక్యం ఇవేమీ చదువులేని సీతలో లేకపోవడం వల్ల, చదువుల్లేని పల్లెటూరి మనుషుల్లో ఉండే స్వచ్ఛత, నిర్మలత్వం సీతలో కనబడటం వల్ల సీత నన్నాకర్షించిందేమో. స్వచ్ఛత, నిర్మల త్వంతో కూడిన అందం ఎంత అపురూపం! ఎంత రమణీయం! నోటినిండుగా 'అత్తయ్య గారూ' అనిపిలుస్తూ ఇంట్లో చేదోడు వాదోడు గా ఉండే సీతంటే అమ్మకీ అభిమానమే. 'రావే, కోడలుపిల్లా' అంటూ సాదరంగా పిలిచేది. సీత గౌను, పరికిణీల్లోంచి ఓణీల్లోకి ప్రమోషన్ పొందాకా, పూర్వంలా చీటికీ మాటికీ నాతో పోట్లాట వేసుకోవడం, గట్టిగా పకపకా నవ్వడం, జడతో నన్ను కొట్టిపారిపోవడం తగ్గినా, నాపరోక్షంలో నా గదిలో చొరబడి తనిఖీ చేసే అధికారిలా నా పుస్తకాలు, స్కెచ్ బుక్కులు, వస్తువులూ తిరగెయ్యడం మాత్రం ఎక్కువైంది.

నా ఇరవయ్యోయేట, డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణ ప్రారంభదశలో ఉన్నపుడు ఓరోజు అమ్మ చెప్పింది - పదిహేనేళ్ళ సీతకి అపుడే పెళ్ళి సంబంధాలు చూస్తున్నట్టు. యధాలాపంగా చెప్పిందో, మరి ఎందుకు చెప్పిందో నాకు తెలియదు - కానీ ఆ సంగతి వింటూనే నాగుండె బరువెక్కినట్టనిపించింది. సీతకి పెళ్ళంటే నాకెందుకు గుండె బరువెక్కాలో నాకర్థంకాలేదు. "ఆహా ! అలాగా" అని నాకు సంబంధించిన విషయం కానట్టు అన్నానే కానీ నాకారోజు నిద్రపట్టలేదు. ఒక ఆడపిల్ల ఊహలతో నిద్రపట్టకపోవడ మనేది ప్రతి యువకుడి జీవితంలోనూ ఎదురౌతుందో లేదో నాకు తెలియదు. సీతకి పెళ్ళంటే నా గుండెల్లో పుట్టిన బాధని ఏమంటారో కూడా నాకు తెలియదు.

మర్నాడు - సీతకి చూసిన సంబంధం కుదరలేదనీ, పెళ్ళికొడుక్కి ఎక్కువ వయసు ఉండటమే కాక ఎక్కువ కట్నం అడిగాడనీ తెలిసాకా నా గుండెని పట్టిన బాధ సర్దుమణి 'గింది విచిత్రంగా. కానీ - మళ్ళీ సంబంధాలు రావా, ఏదోకటి కుదరకపోతుందా అనే ఆలోచన వచ్చాకా మళ్ళీ సన్నగా నా బాధ మొదలైంది.

అక్క నాకన్నా రెండేళ్ళు పెద్ద. నాలుగేళ్ళ నుండీ నాన్న సంబంధాల కోసం చెప్పులరిగేలా తిరుగుతూనే ఉన్నాడు. పెళ్ళికొడుకులు వస్తూనే ఉన్నారు. చూసిపోతూనే ఉన్నారు. వాళ్ళెవరికీ అక్క నచ్చకపోవడం జరగలేదు. జరిగేదల్లా నాన్న - చిన్న బడిపంతులైన నాన్న ఇవ్వచూపే చిన్న కట్నం నచ్చకపోవడమే. అమ్మకీ, నాన్నకీ అక్క ఒక గుదిబండ ఐనట్టు నాకు అర్థమవుతూనే ఉంది. వచ్చే పెళ్ళికొడు కులికి నచ్చే కట్నం నాన్న ఇవ్వలేడనేది ఇంట్లో అందరికీ స్పష్టమే. తల తాకట్టు పెట్టయినా ఏదైనా చేద్దామా అంటే - ఉన్న ఒక్కపిత్రార్జితం, తాతలిచ్చిన ఆ ఒక్క పెంకుటింటినీ అమ్మేసి పెళ్ళిచేస్తే ఇంటిళ్ళపాదీ ఎక్కడ తలదాచుకోవాలి జీవితాంతం? అదైనా తెగించి చేద్దామన్నా నాన్నకష్టాలు ఒక్క అక్క పెళ్ళితో అంతమవవు. నా తర్వాత తమ్ముడు, ఆ తర్వాత ఎదుగుతూన్న మరో చిన్నగుదిబండ కూడా ఉంది.


నాన్న ఇవ్వ చూపిస్తే రేటు పెళ్ళికొడుకుని అమ్మకానికి పెట్టిన పెద్దమనిషి చెప్పాకా అక్క నాలుగురోజులు దిగులుగా, ముభావంగా, మౌనంగా ఉండేది. కన్నవాళ్ళ గుండెలమీద తానొక కుంపటినయ్యానన్న బాధేమో. నాకు - మానవసంబంధాలు ఎంత రసవిహీనంగా యాంత్రికంగా, విచిత్రంగా ఉంటాయో

**అవినీతి పరుల పాలనలో అన్ని నిత్యావసర వస్తువుల రేట్లూ నిత్యమూ అంతులేకుండా పెరుగుతున్నట్టే, కొనుగోలు వస్తువుల జాబితాలో చేరిన ఆత్మాభిమానం, సిగ్గు లజ్జ ఈషణ్మాత్రమూలేని పెళ్ళికొడుకుల రేట్లు కూడా పెరిగిపోతూండడంతో అక్క పెళ్ళిమాట కలలో మాట అనే విషయం నాకు రూఢీ అయ్యింది.**

తెలుస్తూన్న వయసు. రెండు జీవితాలు ప్రేమైక బంధంతో పెనవేసుకుని జీవించడానికి కావల సిన పునాది డబ్బుకావడం ఎంతహేయం! నా విషయంలో ఐనా పెళ్ళికి కట్నకానుకల ప్రసక్తి ఉండకూడదనే దృఢనిశ్చయం తీసుకున్నాను అపుడే.

డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసైనంతమాత్రాన ఉద్యోగం దొరుకుతుందనేది ఒట్టి భ్రమ అని రెండు, మూడేళ్ళ ఉద్యోగ ప్రయత్నాల తర్వాత నాకర్థమైంది. ఇంకా చదువుకోవాలనుకునే నాగాఢమైన వాంఛని నాన్న ఆర్థిక అసమర్థత చంపేసింది. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే ఎమ్మేకి ప్రైవేటుగా చదవసాగాను. అక్క పెళ్ళి దగ్గరపడుతూన్న నాన్న రిటైర్మెంటు, చదువుతున్న తమ్ముడు, ఎదుగుతూన్న మరో గుదిబండ, నా నిరుద్యోగం, దిక్కుతోచని భవిష్యత్తు - ఇన్ని వేధించే సమస్యల మధ్య నాకు ఊరట కలిగించే ఏకైక విషయం - సీత ఊహ! సీతకి ఇంకా ఏ సంబంధం కుదరక పోవడం నాకు ఓదార్పు. మానాన్నలాగే సీత తండ్రి ఆర్థిక అసమర్థతే సీత పెళ్ళికి అవరోధం అని నాకు తెలుసు. కానీ సీత అందచందాలూ, ముఖవర్చస్సూ చూసి ఏ పెళ్ళికొడుకైనా - 'కట్నం లేకపోయినా సరే, సీతని చేసుకుంటాను' అని అంటాడేమోనని, ఎక్కడ సీతని ఎగరేసుకుపోతాడోనని - సీతకు సంబంధం వచ్చినపుడల్లా నా గుండె వేగంగా కొట్టుకునేది.

డబ్బుకోసం, కానుకల కోసం, లాంఛ నాలకోసం, స్కూటర్లకోసం - సీత అంద చందాల్నీ, వెలకట్టలేని స్వచ్ఛమైన, నిర్మలమైన




సీత మనసునీ ఒదులుకునే మూర్ఖుల్ని చూస్తే కోపానికి బదులు - నా సీతని వదిలిపెట్టినందుకు ఆనందించి, సౌందర్యపు విలువలు తెలియని ఆ మూర్ఖులకి మనసులో కృతజ్ఞతలు తెలుపుకునేవాడ్ని. పెంటకుప్పమీద జొన్నగింజలు వెదుక్కునే కుక్కుటానికేం తెలుసు - ఆ కుప్పలో తను కాలితో గెంటేసిన అమూల్యమైన వజ్రం గొప్పదనం.

ఓరోజు నేను ఇంటర్వ్యూకి వెళ్ళి ఇంటికి వచ్చేసరికి నా గదిలో నా పుస్తకాలనీ, పెయింటింగ్‌లనీ నా పరోక్షంలో దొంగలా తిరగేస్తున్న సీత - జాబ్ అప్లికేషన్‌కి అతికించడానికోసం తీయించుకున్న నా ఫొటోని డ్రాయర్ సొరుగులోంచి లాగి, అటూ ఇటూ చూసి, ఛటుక్కున ముద్దుపెట్టుకోవడం నాకళ్ళబడింది. అప్పటివరకు సీత మనసులో నా స్థానం ఏమిటో తెలీని నాకు (బద్ధుని కదా!) రాకెట్‌లోని మనిషి బరువుని కోల్పోయినట్టు దూదిపింజెలా నా మనసు ఎగిరిపోయింది. సన్నగా దగ్గి గదిలోకి అడుగుపెడుతున్న నన్ను చూసి కంగారుపడి, ఆ ఫొటోని జాకెట్లోకి జారవిడిచి, తప్పించుకుని పారిపోబోయింది. గుమ్మాని కడ్డంగా చేతులడ్డుపెట్టి నిలుచున్నాను. తత్తరబోయి. బెదిరిన లేడిలా చూస్తున్న చక్రాల్లాటి ఆ విశాలనయనాలవంక నవ్వుతూ చూస్తూ - "మనసుకి నచ్చిన పనిచేయడం నేరం ఏమీ కాదని తెలుసుకో" అంటూ దారి ఇచ్చాను. ఎవరో తరుముతున్నట్టు వెనక్కి తిరిగి చూస్తూ పారిపోయింది. "సీత నాదేనోచ్'! అని పర్వతాలెక్కి చాటాలనిపించింది. మబ్బుల్నీ, ఎగురుతూన్న కొంగల గుంపునీ పిల్చి చెప్పాలనిపించింది. పువ్వులపై వాలుతున్న సీతాకోక చిలుకల్ని పిలిచి ఈ విషయాన్ని లోకమంతా మీరెక్కలతో చాటింపువేసి చెప్పండి అనాలనిపించింది. సీత నాదే అనే ఊహముందు - అక్కపెళ్ళి, నా నిరుద్యోగం చాలా అల్పమైన విషయాలుగా తోచాయి. ఈ కష్టాలన్నీ ఎల్లకాలం ఇలాగే ఉండిపోతాయా? అక్కకి పెళ్ళవక పోతుందా, నాకు ఉద్యోగం రాకపోతుందా - ఇవన్నీ జరిగాకా సీతమెడలో మూడుముడులూ వెయ్యకపోతానా అని ధైర్యం వచ్చింది.

ఎమ్మే ఫస్ట్‌క్లాస్ పాసైనా, నా ఉద్యోగావకాశాలు ఏమాత్రం మెరుగవలేదు. ఈ దేశంలో కోరిన కట్నం ఇచ్చుకోలేని ఆడపిల్లకి పెళ్ళయేరాత లేనట్టే - ఉత్తర దక్షిణాలు సమర్పించుకోలేని నిరుద్యోగిని ఉద్యోగం వరించదనే జీవన సత్యాన్ని కష్టంమీద జీర్ణించుకోక తప్పలేదు. ఆడపిల్ల పుడితే - మహాలక్ష్మి పుట్టింది అన్న సమాజమేనా ఇది? దేశంనిండా ఎన్నిలక్షలమంది పెళ్ళికాని మహాలక్ష్ములున్నారో! ఆచరణలో మహాలక్ష్మిపదానికి ఎంత చక్కని నిర్వచనం ఇచ్చే సమాజం!

సీతా, నేను ముఖాముఖీ మా విషయం ఏనాడూ మాట్లాడుకోపోయినా , మా ఇద్దరి మనసులూ మా ఇరువురికీ స్పష్టమే. మా మూగమనసుల ఊసు మనుషులభాషలో చెప్పుకోవాల్సిన అవసరం ఉందనిపించలేదు. నేనెక్కడ ఉన్నా చక్రాల్లాటి సీతకళ్ళు నాతోనే ఉన్నట్టనిపించేది. సీత పరాయిదాన్లా కాక, నా స్వంత మేనమామ కూతురైనట్టు, సీతపై నాకు జన్మహక్కు ఉన్నట్లనిపించింది. నాకో ఉద్యోగం వచ్చి నాకో బతుకు తెరువు దొరికే దాకా సీతపై నా ఇష్టాన్నీ, హక్కునీ నలుగురిలో వెల్లడిచేయడం సమంజసం కాదనిపించింది. అందుకే సీతపై పెంచుకుంటున్న నా ఆశని ఎవరికీ తెలవనివ్వలేదు. నాకు ఉద్యోగం రాగానే - "సీతని కానీ కట్నం లేకుండా చేసుకుంటాను, మా అక్కపెళ్ళి అవనీయండి' ' అని అనగానే సీత తల్లిదండ్రులూ, సీతా ఎంతపొంగిపోతారో, సీత నా కౌగిట్లో గువ్వపిట్టలా ఎలా ఒదిగిపోతుందో ఊహిస్తూ పగటి కలలు కనేవాణ్ణి.

మనిషి ఒకటి తలిస్తే దైవం (?) మరొకటి తలుస్తాడో లేదో నాకు తెలియదు కానీ - ఆడపిల్లలకి కట్నం ఇచ్చుకో లేక నానా తిప్పలూ, ఇబ్బందులుపడే తల్లిదండ్రులు మాత్రం కొడుకు పెళ్ళి విషయానికొచ్చేసరికి మరొకలా తలుస్తారని నాకర్థమైంది.

అక్కకి పెళ్ళీడు దాటిపోతూంటే - అవినీతిపరుల పాలనలో అన్ని నిత్యావసర వస్తువులరేట్లూ నిత్యమూ అంతులేకుండా పెరుగుతున్నట్టే, కొనుగోలు వస్తువుల జాబితాలో చేరిన - ఆత్మాభిమానం, సిగ్గు, లజ్జ ఈషణ్మాత్రమూలేని పెళ్ళికొడుకుల రేట్లు కూడా పెరిగి పోతూండడంతో అక్క పెళ్ళిమాట కలలోమాట అనేవిషయం నాకు రూఢీ అయింది. ఇంట్లో - ఎవరో పోయిన దిగులు లాటి దిగులు! ఆడపిల్లని వదుల్చుకోవడం ఎంతవిషమ సమస్య ! కాసుల గలగలతో అడుగుపెట్టని మహాలక్ష్మి ఎవరికీ అక్కర్లేని సమాజం ఎంతగొప్పది! భారతీయులకి మహాలక్ష్మి అంటే ఎంతప్రేమ ! అంత దిగులులోనూ, నా తల్లిదండ్రులకి మిగిలిన ఏకైక ఆశాకిరణం నేను ఒక్కణ్ణే అనే విషయం అమ్మ నర్మగర్భంగా చెప్పేవరకూ నాకు తట్టనేలేదు. నిజమే! అమ్మకీ, నాన్నకీ డబ్బిచ్చి ఒదుల్చుకోవలసిన శాల్తీ ఉండటమే కాదు, డబ్బు తెచ్చే శాల్తీ కూడా ఒకటి ఇంట్లో ఉందని నా ఆదర్శభావాల బుర్రకి తట్టనేలేదు. ఆదర్శభావాలెపుడూ సమాజాన్ని ఆలస్యంగానే అర్థం చేసుకుంటాయేమో.

నాకు ఉద్యోగం వస్తే, నాకు మంచిరేటు పలికితే (పలక్క ఛస్తుందా?) ఆ డబ్బుతో అక్కపెళ్ళి చెయ్యచ్చు అనే ఊహ, లౌక్యం అమ్మా, నాన్నలకి రావడం, నాకు రాకపోవడం చాలా సహజమే అనిపించింది. అంతరాత్మ కొరవడిన సమాజంలో పిల్లలు కూడా కొనుగోళ్ళు - అమ్మకాలకి సంబంధించిన ఆర్థిక వస్తువులేగదా! కష్టపడి కని, పెంచి పెద్దచేసినందుకు పిల్లలపై ఆమాత్రం హక్కు (?) తల్లిదండ్రులకు లేదనడం, ఉండకూడదనడం నా ఆదర్శభావాల మూర్ఖత్వం అవుతుందేమో.

నా ఆదర్శభావాలని (సీత నాకు నచ్చింది కాబట్టి కట్నం తీసుకోకపోవడం ఆదర్శమెలా అవుతుందో? అందులో ఉన్నదీ నా స్వార్థమేగా! ఆదర్శం వెనక ఉండేది కూడా స్వార్థం!) కాసేపు ప్రక్కన పెట్టిచూసిన, అలా ఆలోచించడంలో నా తల్లిదండ్రుల తప్పుకూడా ఏమీ లేదేమో. దేశంలోని లక్షలాది సగటు


తల్లి దండ్రుల్లాగే వాళ్ళూ ఆలోచిస్తున్నారు. వందల సంవత్సరాలు, అక్రమాలని అతి సహజమైన విషయాలుగా భావించే ఆ మనుషులకి నేనేం చెపితే అర్థమవుతుంది? అక్రమ పద్ధతులు బుర్రకెక్కినంత సులువుగా ఆదర్శాలు బుర్రకెక్కవుకాబోలు.

"ఆడపిల్లకి కట్నం ఇవ్వక తప్పదు (?) కాబట్టి, ఇచ్చింది రాబట్టుకునేందుకు అబ్బాయికీ పుచ్చుకుంటున్నాం. ఇందులో మాకు మిగిలే లాభమేమీలేదు" అనే అమ్మా, నాన్నల మాటలో ఏదోతిరకాసు ఉందని పించిది. అచేత్తో పుచ్చుకోవడం ఆ చేత్తో ఇచ్చెయ్యడానికేగా అనేది వినడానికి బాగానే ఉన్నా, ఈ లాజిక్‌లో ఏదో పెద్దలోపం ఉంది - నేను వివరించలేనిది.

తగిన కట్నం ఇచ్చి అక్కకి ముందు పెళ్ళి చెయ్యలేరు కాబట్టి సంప్రదాయాలను అవసరార్థం పక్కనపెట్టి, ముందు నాకు పెళ్ళిచేసి (రైతు చేతికి అందివచ్చిన పంటతో అప్పుతీర్చినట్టు!) ఆ కట్నంతో అక్క పెళ్ళి చెయ్యవచ్చునీ, అలాతప్ప అక్కకి పెళ్ళయ్యే మార్గాంతరం లేదనీ వాళ్ళు భావించడంలో వింతేమీలేదు.

కానీ .... కానీ .... నన్ను కట్నానికి అమ్ముకోవాలంటేనాకు దక్కేది సీతకాదు. మరెవరో, నన్ను కొనుగోలు చేయగలిగే పిల్లకి స్వంతం (బానిస) అవుతాను. అమ్మకాలూ - కొనుగోళ్ళు! మనుషులకి అర్థశాస్త్రం తెలిసినట్టు మరే శాస్త్రము తెలీదేమో.

చూస్తూ, చూస్తూనే నాకే ఇరవైఎనిమిదేళ్ళు వచ్చేసాయి. అంటే అక్కకి ముప్పై. వృద్ధకన్యల జాబితాలోకి అడుగుపెడుతోంది. ఆడబతుక్కి - పెళ్ళి, మొగుడు, సంసారం తప్ప మరేపరమార్థ మూ లేదనుకునే సగటు ఆడదైన అక్క - ఇంక పెళ్ళయేరాత లేదనే బెంగతో, తనెవరికీ అక్కర్లేదనే అవమానంతో, బాధతో చిక్కి, అకాల వృద్ధాప్యం వచ్చినదానిలా కళ్ళక్రింద నలుపు చారలతో గుంటలుపడి, నెరుస్తూన్న చెంపలతో - ఎంతకట్నం ఇచ్చినా చేసుకునేవాడు దొరుకుతాడా అనేటట్టు తయారైంది. సీతకేం? చిదిమి దీపం పెట్టుకోవచ్చు, బంగారబ్బొమ్మ! ఎవడు చేసుకుంటాడోగానీ అదృష్టవంతుడు....." అనే అమ్మకి। "కోడలుపిల్లా...." అని నోరారా పిల్చే అమ్మకి నా మనసులో ఏముందో తెలియదా? సీతమనసులో ఏముందో తెలీని, తెలుసుకోలేని అమాయకురాలా అమ్మ? సాటి ఆడదానికి ఆడదిచేసేంత ద్రోహం మగాడుకూడా చెయ్యడేమో. కట్నం - కోరినంత కట్నం తేలేదు కాబట్టి బంగారబ్బొమ్మకి కోడలయ్యే




అర్హతలేదన్నమాట!

నాకు ఉద్యోగం ఎంత అవసరమైనా - ఉద్యోగంరాగానే నన్ను సీతకు కాక మరెవర్తికో అమ్మకం పెడతారని తెలిసాకా - నాకు ఉద్యోగం వస్తుందేమోనని భయం పట్టుకుంది. ఉద్యోగం రాకూడదని - ఏదోరకంగా అక్క పెళ్ళయేవరకూ రాకూడదని తోకలున్న దేవుళ్ళనీ, లేని దేవుళ్ళనీ కూడా ప్రార్థించాను.

సరిగ్గా అపుడే జరిగింది - వృద్ధకన్య బతుకుమీద విరక్తితో అక్క నిద్రమాత్రలతో చేసిన విఫల ఆత్మహత్యా ప్రయత్నం.

నా స్వార్థంతో అమానుషంగా ఆలోచిస్తున్నానో నాకు తెలిసివచ్చింది. సీత నాదవడంకోసం అక్కనీ, తల్లిదండ్రులనీ వదులుకోవాలనుకునే నా స్వార్థంమీద నాకే అసహ్యం వేసింది. నాసోదరిపట్ల నాకేమీ బాధ్యత లేనట్టు, నాకేమీ పట్టనట్టు ఆలోచించడం సబబేనా?

స్వార్థం మనుషులని ఎంత వికృతంగా ఆడిస్తుంది! మనుషులమధ్య మమకారాల్నీ, అనుబంధాలనీ చంపి ఒకరికొకరు ఏమీకాకుండా చేసే బలీయమైన సహజాతం కాబోలు స్వార్థం. చదువుతో, నాగరికతతో, వేచనతో కూడా, లొంగదియ్యలేని స్వార్థం ముందు మనిషి ఎప్పటికీ దుర్బలుడేనా? కీలుబొమ్మేనా? ఇది ఎన్నటికీ జవాబులేని ఒకవింత ప్రశ్నేమో.

ఈ దోలాయమానంలో ఉండగానే, అక్కకి ఇంక పెళ్ళవుతుందనే ఆశ క్షీణించిన ఆదశలోనే - అక్క అదృష్టమో నా దురదృష్టమో అక్కకో సంబంధం వచ్చింది.

కట్న ప్రమేయం లేని సంబంధం!

లోకంలో మంచితనం చావలేదనడానికి నిదర్శనం అన్నట్టుగా వచ్చిందా సంబంధం. కానీ ఆ మంచితనపు రెండో పార్శ్వంవైపు ఉంది - నామెడకి ఉరి! ఆ ఉరి నాక్కాబోయే బావగారి కురూపి చెల్లెలు! కురూపితనం వల్ల పెళ్ళికాక, కన్నెచెర విడిపించే పుణ్యాత్ముడికోసం సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మరో వృద్ధకన్య!

ఆ వృద్ధకురూపికన్య కన్నెచెరను విడిపిస్తే ప్రతిఫలంగా ముందుగానే ఓ ఉద్యోగం ఇప్పించి, నిరుద్యోగ చెరనుంచి నన్ను విడిపిస్తారట. సర్వేజనా సుఖినోభవంతు! ఏమి ఇచ్చిపుచ్చుకోడాలు! జీవిత మంటే ఇచ్చిపుచ్చుకునే ఒక బిగ్‌డీల్! ఈ ఒప్పందం అంతా నా పరోక్షంలోనే, నాప్రమేయం, అనుమతి, అంగీకారాల్లేకుండానే జరిగిపోయింది! వేసి గుమ్మడి కాయలువిత్తి పండించిన రైతు చక్కగా ఎదిగిన గుమ్మడికాయల్ని అడుగుతాడా - నిన్నుకోసి అమ్ముకోనావద్దా అని? విత్తువేసి పండించుకున్నందుకు అవి అతని స్వంతం. అమ్ముకోనూగలడు - ఎండపెట్టి పారబేసుకోనూగలడు. ఎవరు కాదనగలరు? భార్యాపిల్లల్ని సత్యహరిశ్చంద్రుడు అమ్ముకోలేదా? అవసరంపడినపుడు అమ్ముకోడానికి కాక ఇంకెందుకు పురాణదేశపు పురుషులకి పత్నులూ, సంతానమూను? తల్లిదండ్రుల ఇష్టానుసారం అమ్ముడుబోయి పితృరుణం, మాతృరుణం తీర్చుకోవడంకన్నా పిల్లల జన్మలకిసార్థకత ఏముంటుంది?

తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడం కోసం, అక్కజీవితాన్ని ఉద్ధరించడం కోసం - నా జీవితాన్నీ, నాసీత జీవితాన్ని నేను బలిపెట్టాలా? లేక -

నా ఊపిరిలో ఊపిరైపోయిన నాసీతకోసం నాకుటుంబాన్ని బలిపెట్టాలా? కనిపెంచినందుకు విశ్వాసం లేని కృతఘ్నుడు అని శపిస్తారేమో. తను ప్రేమించిన పిల్లకోసం తోడబుట్టినదాన్ని సైతం విస్మరించిన స్వార్థపరుడు అంటుందేమో అక్క.

ఎవరి ఉసురుపోసుకోవాలి నేను ? పావు జీవితాన్ని నడిపించిన తల్లిదండ్రులా -

ముప్పావు జీవితాన్ని నడిపించబోయే ప్రియురాలా? త్రాసు ఎటుమొగ్గాలి?
ఏమైపోతుంది నాసీత?
నాకు మనసిచ్చి పుచ్చుకునే నాకోసమే నిరీక్షిస్తున్న అమాయకపు పిల్ల! వయసు వచ్చినా ప్రపంచపు విషపుటాలోచనలు, లోకదుర్నీతినే ఎరగని ముగ్ధ నాసీత ఏంపాపం చేసిందని ఈ శిక్ష? నన్ను కదలకుండా నిలబెట్టి నా కనుపాపల్లో తన ప్రతిబింబం చూసుకునే నాసీత- తన కనురెప్పల వాకిట్లో నన్ను కట్టిపడేసిన నా సీత- తల్లిని హత్తుకునే పసిబిడ్డలా నన్ను హత్తుకుపోయే క్షణం కోసం నిరీక్షిస్తూ రోజుఒక యుగంలా గడుపుతూన్న నాపిచ్చిసీత ఏమైపోతుంది? గుండె బద్దలవుతుందా?
సీత ఏమైతేనేం? సీత స్థానంలో మరో గీతో, నాతలరాతో ఎవర్తో వస్తుంది. లోకం విఫలమైన అన్ని ప్రణయాల్లాగే నేనూ సీతనీ, మామూగ ప్రణయాన్నీ కొన్నాళ్ళకి మరచిపోయి నాతలరాతకి యాంత్రికంగా పిల్లల్ని కంటాను కాబోలు!
ఈ ప్రేమోద్వేగాలూ, ప్రణయావేశాలూ, వలపుల తలుపులు అన్నీ అణగారిపోయి, అర్థంలేని పిచ్చివాడి చేష్టల్లా మరుగునపడి, బతుకుతెరువు చెరువులో ఒంటరి చేత్తో ఈదుతూ, పిల్లల చదువులు, పెళ్ళిళ్ళ కట్నాలు సమకూర్చుకునే తాపత్రయంలో నేనూ అర్థశాస్త్రం తప్ప మరో ఆనందం పట్టించుకోని కబోది నవుతానేమో.

నమ్ముకున్న ఆడదాన్ని నట్టనడియేట్లో ముంచడానికి రాముడైతేయేమి, సత్యహరిశ్చంద్రు డైతేయేమి, నలుడైతేయేమి - ఆ మహానుభావుల అంశ ఇన్నివేల సంవత్సరాల జాతి వారసత్వంలో నాకూ సంక్రమించింది కాబోలు- నన్ను నమ్ముకున్న నా సీతని నడియేట్లో ముంచి తప్పుకోడానికి!
ఎవరీ దౌర్భాగ్య పరిస్థితులకి కారణం?

కనిపించని ఏ పెనుభూతం ఇలా జీవితాలతో చెలగాటాలాడుతోంది?
కష్టాలు మానవీయమా? దైవీకృతమా? విధా? ఆ మాటలో నమ్మకం లేదునాకు.

ఆడపిల్లలకి కట్నాలివ్వడం మానేసి, మగపిల్లలకి పుచ్చుకోకుండా ఉండటమే కాదా ఈ సమస్యలకి పరిష్కారం? పిల్లలని ఆర్థిక వస్తువులుగా పరిగణించడం మానడం కాదా పరిష్కారం? కానీ ఎవరు మొదలు పెడతారు ఈ ఇచ్చిపుచ్చుకునే దౌర్భాగ్య, జుగుప్సాకరమైన దుస్సాంప్రదాయాలకి స్వస్తి చెప్పడం? నాతల్లిదండ్రులా? ఊహుం! నన్ను కొనబోయే అత్తమామలా? సీత తల్లిదండ్రులా? వీరా? మీరా? ఊహుం! ఎవరూ ముందుకు రారు! ఎవరో అల్లిన సాలెగూడులో చిక్కుకున్న ఈగల్లా గిజగిజలాడతారేగానీ, పరిష్కారంవైపు ఆలోచించరు! స్వార్థమనే బలమైన ఉక్కుదారాలతో అల్లబడిన ఈ సాలెగూటిని ఛేదించలేని శక్తిహీనమైన కీటకాన్ని. నా అశక్తతని సీతకెలా తెలియచెయ్యాలి? ఎలా క్షమించమని అడగాలి? మగవాడినై ఉండీ నిర్లజ్జగా నిస్సహాయతని ప్రదర్శించె నా నమ్మకద్రోహానికి సీత నాకే శిక్ష విధించినా అది తక్కువే. సీత నా ద్రోహానికి నన్ను అసహ్యంచుకుని నా ముఖాన ఉమ్మితే నాపాపానికి, నాచవటతనానికి సరియైన శిక్షగా భావిస్తాను. కానీ సీత అలాచెయ్యదు.

నిప్పుల్లో దూకమన్న రాముణ్ని చూసి నిర్ఘాంతపోయిన సాధ్వి సీతలా - చక్రాల్లాటి చారెడేసి కళ్ళు ఇంకా పెద్దవిచేసి, ఆశ్చర్యంగా - "ఛీ! నీచుడివి, పిరికిపందవి, నమ్మకద్రోహివి!" అని కళ్ళతోనే శపిస్తుందేమో.

నిర్మలత్వం ఇచ్చే కాంతితో వెలిగే ఆ కళ్ళల్లోకి చూడలేను. చూస్తూ చెప్పలేను - ఇన్నాళ్ళ నిరీక్షణ తర్వాత నన్ను మరచిపొమ్మని. ఆ సాలెగూటిలోంచి బయటపడలేని అశక్తుణ్ణి.

మారరు - ఈ మనుషులెన్నటికీ మారరు! హృదయాల్లేకుండా పుట్టే ఈ మనుషులెన్నటికీ మారరు!

Phones : 74639
75400

Sri Kanakadurga
Garden Restaurant

ELURU ROAD, GOVERNORPET
VIJAYAWADA - 520 002.

Sreedevi Centrally A/c
Family Restaurent
Chainese, Ceentinantal, South
and North Indian Dishes Veg &
Non Veg.